సాక్షి
నంద్యాల

శనివారం । 30 । మార్చి । 2024

మీరంతా సిద్ధమేనా..

ఎమ్మిగనూరు బహిరంగ సభలో పిడికిలి బిగించిన సీఎం వైఎస్ జగన్





దారి పొడవునా పూలవాన.. కోడుమూరులో పూలు చల్లుతూ జననేతకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

- సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభకు ఉప్పెనలా కదిలివచ్చిన జనం
- జన సంద్రంగా మారిన ఎమ్మిగనూరు పట్టణం
- చేనేతపురిలో 'మేమంతా సిద్ధం సభ' సూపర్ సక్సెస్
- మూడో రోజు బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- ఊరూరా పూలవర్షం కురిపిస్తూ ఆత్మీయ స్వాగతం
- దారిపొడవునా పెల్లుబికిన అభిమానం
- ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిన ముఖ్యమంత్రి ప్రసంగం

జిల్లా పశ్చిమ ప్రాంతం మురిసిపోయింది.. అభిమాన నేతను చూసిన ఆనందక్షణంలో ప్రజల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. మేమంతా సిద్ధం బస్సుయాత్రకు పల్లెపల్లెలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జైత్రయాత్రకు ఊరూవాడా కదిలివచ్చింది. సంక్షేమ సారథితో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు యువత పోటీపడింది. జననేత ఆత్మీయ పలకరింపులతో అవ్వాతాతల్లో సంతోషం వెల్లివిరిసింది. అభివృద్ధి ప్రదాతకు అడుగడుగునా అక్కచెల్లెమ్మల ఆశీర్వాదం లభించింది. చేనేతపురి ఎమ్మిగనూరు జనసంద్రంలా కనిపించింది. కుట్రల కూటమిని ఓడించేందుకు 'మేమంతా సిద్ధం' అనే నినాదం ఉవ్వెత్తున ఎగసింది. బిగిసిన పిడికిళ్లు.. వెలిగిన సెల్‌ఫోన్ల లైట్లు.. వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలతో సీఎం బహిరంగ సభ భవిష్యత్తుకు బాటలు చూపింది.

చేనేత పురిలో జనహోరు

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా చేనేతపురి ఎమ్మిగనూరులో నిర్వహించిన సీఎం బహిరంగ సభ జన సంద్రాన్ని తలపించింది. స్థానిక వీవర్స్ కాలనీ మైదానంలో ఇసుకేస్తే రాలనంత మంది జనం. కనుచూపు మేర జనమే కనిపించారు. భారీగా తరలివచ్చిన జనంతో ఎమ్మిగనూరు పట్టణంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచే ఎమ్మిగనూరు పట్టణంలోకి వచ్చే దారులన్నీ జనంతో పోటెత్తాయి. సభాప్రాంగణం వైఎస్సార్‌సీపీ జెండాలతో నిండిపోయింది. ఎటు చూసినా జనం..జనం.. ప్రభంజనంలా కనిపించింది. పురుషులతో పోటీ పడుతూ మహిళలూ బహిరంగ సభకు తరలివచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నారులు, ముసలివాళ్లు కూడా వచ్చారు. ఈలలు, కేకలతో యువత సభను హోరెత్తించారు.



ఎండను సైతం లెక్క చేయక.. మిద్దెలెక్కి, మెట్ల మీద నిలిచి బస్సు యాత్రకు సంఘీభావం తెలుపుతున్న మహిళలు

జైత్రయాత్రకు జన ఆశీర్వాదం



జనసంద్రం: ఇసుకేస్తే రాలనంత మంది జనంతో ఎమ్మిగనూరు వైడబ్ల్యూసీఏ మైదానం

కర్నూలు (అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు జనం నీరాజనాలు పలికారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఉరకలెత్తిన ఉత్సాహంతో అభిమాన నేతకు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం పెంచికలపాడు శిబిరం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. అంతకు ముందే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలనే బలమైన కోరికతో వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రాత్రి బస శిబిరం వద్దకు చేరుకున్నారు. నాయకులను, కార్యకర్తలను ఆత్మీయంగా పలకరిస్తూ సీఎం వైఎస్ జగన్ ముందుకు కదిలారు. దారి పొడవునా వేలాదిగా జనం బారులు తీరి జననేతకు ఘన స్వాగతం పలికారు.

పోటెత్తిన అభిమానం..

మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఉదయం 11:30 గంటలకు కోడుమూరు చేరుకోగానే వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. కోడుమూరులోని గూడూరు రోడ్డులో భారీ క్రేన్ ద్వారా పూలమాలలు వేసేందుకు నాయకులు సిద్ధమయ్యారు. అలాగే కోట్ల సర్కిల్, కొత్తబస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా జననేతను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దారి పొడవునా చిన్నారుల నృత్యాలు, బాజాభజంత్రీలు, డప్పుల మోతతో బస్సుయాత్ర సాగింది. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో బుడగజంగాలు భారీ క్రేన్ సాయంతో పూలమాల వేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు.

అపురూప కానుక



కోడుమూరులో సీఎం వైఎస్ జగన్‌కు మగ్గాన్ని బహూకరిస్తున్న దృశ్యం

యుద్ధానికి సిద్ధం



అభిమాని బహూకరించిన ఖడ్గాన్ని వరలో నుంచి తీస్తున్న సీఎం జగన్

ప్రగతి 'పల్లవి'



బుడగజంగాల వారు ఇచ్చిన తంబూరాను మీటుతున్న జననేత



చేనేతలు బహూకరించిన చీరను చూస్తూ...

ప్రజలతో మమేకమవుతూ..

ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రారంభ గ్రామమైన వేముగోడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం లభించింది. స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, గోనెగండ్ల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడే ఏర్పాటు చేసిన షామియానాల కింద వేచిఉన్న మహిళల దగ్గరికి వెళ్లి సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం బస్సు యాత్ర హెచ్ కైరవాడి మీదుగా గోనెగండ్లకు చేరుకుంది. గోనెగండ్ల బస్టాండ్ ప్రాంతంలో వేలాది మంది ప్రజలు జననేతకు ఘనస్వాగతం పలికారు. బస్సు దిగి ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు అభివాదం చేశారు.

జోష్ నింపిన జననేత ప్రసంగం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి మహిళలు, యువత నుంచి భారీ స్పందన వచ్చింది. ఆయన మాట్లాడుతున్నంతసేపు ప్రజలు శ్రద్ధగా విన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూనే... ప్రతిపక్షాలపై పంచ్‌లతో సీఎం జగన్ ఆకట్టుకున్నారు. నయవంచకులను పొరపాటున కూడా నమ్మొద్దని సీఎం చేసిన విజ్ఞాపనకు ప్రజల నుంచి కూడా భారీ స్పందన వచ్చింది. ఎన్నికల్లో మీ బిడ్డను గెలిపించేందుకు 'మీరంతా సిద్ధమేనా' అన్నప్పుడు 'సిద్ధమే' అంటూ సమాధానం వచ్చింది. మహిళలకు, రైతులకు, చేనేతలకు, విద్యార్థులకు చేసిన మేలును గురించి వివరిస్తున్నప్పుడు విశేష స్పందన లభించింది.

సీఎంను కలసిన ప్రజాప్రతినిధులు

బస్సు యాత్ర ప్రారంభం కాకమునుపే పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను పెంచికలపాడు శిబిరంలో కలిశారు. ముఖ్యమంత్రిని కలసినవారిలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కర్నూలు, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు, హాఫీజ్ ఖాన్, డాక్టర్ జె. సుధాకర్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, మణిగాంధీ, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో పాటు పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు.

రెండేళ్ల తర్వాత రాజ్యసభకు హఫీజ్‌ఖాన్

'నా మనసులో ఎలాంటి కల్మషం లేదు. చంద్రబాబు నాయుడు లా నేను మాట తప్పే వ్యక్తిని కాదు. రెండేళ్ల తర్వాత వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో ముస్లిం కోటాలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌ను రాజ్యసభకు పంపిస్తాను' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు.

సీఎం బస్సుయాత్ర సైడ్ లైట్స్...

- మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర మూడో రోజు శుక్రవారం గూడూరు మండలం పెంచికలపాడు నుంచి ప్రారంభమైంది. బస్సు యాత్రకు అక్కచెల్లెమ్మలు, యువత అడుగడుగునా నీరాజనం పలికారు.
- కోడుమూరులో జననేతకు ఘన స్వాగతం లభించింది. మండుటెండను సైతం లెక్కచేయక వేలాది మంది ప్రజలు అభిమాన నేతను చూసేందుకు బారులు తీరి కనిపించారు. మహిళలు పూలు చల్లుతూ ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం పలికారు.
- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్రేన్‌లతో గజమాలలు వేస్తూ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన ప్రజలకు సీఎం జగన్ అభివాదం చేస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు.
- కోడుమూరుకు చెందిన చేనేత కార్మికులు మగ్గం, స్వయంగా నేసిన పట్టుచీరను బహూకరించారు.
- కోడుమూరు పట్టణంలో సుమారు రెండు గంటల పాటు యాత్ర కొనసాగింది.
- వర్కూరులో మహిళలు సీఎంకు రెండు చేతులెత్తి మొక్కుతూ ''జగనన్న మళ్లీ మీరే రావాలి... మీరు వస్తేనే మాకు భవిష్యత్తు'' అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.
- పుట్టపాశం, హెచ్.కైరవాడి, గోనెగండ్ల, రాళ్లదొడ్డి, ఎర్రకోట గ్రామాల్లో మహిళలు, యువతీ యువకులు రోడ్లకు ఇరువైపు నిల్చొని జననేతకు బ్రహ్మరథం పట్టారు.

– కోడుమూరు రూరల్/ కర్నూలు(సిటీ)/ కర్నూలు కల్చరల్



పోటెత్తిన అభిమానం.. జనసంద్రంగా మారిన ఎమ్మిగనూరు శివసర్కిల్

అభ్యర్థులను దీవించండి

జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారందరినీ దీవించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోరారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవై రామయ్య, కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఆదోని అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఇంతియాజ్, డాక్టర్ సతీష్, బుట్టా రేణుక, కంగాటి శ్రీదేవి, విరూపాక్షి, బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డిలను ఆశీర్వదించాలని ఆయన కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, డాక్టర్ ఎ.మధుసూదన్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను పరిచయం చేస్తున్న సీఎం జగన్



'సంక్షేమ' సంతోషం.. ఇళ్ల పట్టాలను చూపుతున్న మహిళలు



జననేతను చూసేందుకు.. చెట్టెక్కిన అభిమానులు



మా భవిష్యత్తు మీరే.. జననేతను చూసిన ఆనందంలో అక్క చెల్లెమ్మలు



యువ తరంగం.. సభలో చేతులెత్తి మద్దతు తెలుపుతున్న యువకులు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:49
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:52
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:46
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:47
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:47

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

చూపు ఎంత మంచిదో అంతకు మించిన ప్రమాదకారి. మనిషి పాపాలకు చూపు మొదటి ఆయుధం. పాపాలు చేయకుండా ఉండేందుకు చూపును నియంత్రణలో ఉంచుకోండి.

– పవిత్ర ఖురాన్

బాబుకు ఓట్లు అడిగే హక్కు లేదు

- క్షమాపణలు చెప్పిన తర్వాతనే ప్రజల్లోకి రావాలి
- పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న ఘనుడు బీసీ
- భైరెడ్డి శబరి.. ఆమె తండ్రి హత్యా రాజకీయాలు తెలుసుకోవాలి
- బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: గత ప్రభుత్వంలో హామీలను విస్మరించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి ఇప్పుడు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. బనగానపల్లె శుక్రవారం జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబునాయుడు, మాజీ ఎమ్మెల్యే బీసీలు మాట్లాడిన తీరును కాటసాని తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల ముందు రైతులకు రూ.87 వేల కోట్లు, పొదుపు మహిళలకు రూ.14 వేల కోట్లు రుణమాఫీ చేస్తానన్న హామీతో పాటు మొత్తం 600 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో కూడా మళ్లీ ప్రజలను మోసం చేసేలా బాబు హామీలు ఇస్తున్నారన్నారు. ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతనే ప్రజల్లోకి రావాలని హితవు పలికారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో రూ. 370 కోట్లు దోచుకుని జైలు పాలయ్యాడన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడంతో ధైర్యంగా మళ్లీ ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్నామన్నారు. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి శబరి తనపై ఆరోపణలు చేసే ముందు ఆమె తండ్రి భైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హత్య, రాజకీయ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. సొంతగా భూమి కొనుగోలు చేసైనా సరే బనగానపల్లె పట్టణ పేద ప్రజలకు ఇంటి స్థలాలను పంపిణీ చేస్తామని చెప్పిన మాజీ ఎమ్మెల్యే బీసీ ఇప్పుడు అధికారంలోకి వస్తే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చంద్రబాబును కోరడం ఎంత వరకు సమంజసమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకున్న ఘనత బీసీది కాదా అని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పంపిణీ జరిగితే సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యేగా తనకు మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతోనే అడ్డుకున్న విషయం ప్రజలందరికీ తెలుసనన్నారు. రవ్వలకొండపై బీసీ అక్రమ మైనింగ్‌పై తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే విజిలెన్స్ అధికారులు రూ.16 కోట్ల జరిమానా విధించారన్నారు. బనగానపల్లె పట్టణంలోని ఖాదీ గ్రామోద్యోగ సమితికి చెందిన స్థలాన్ని నిబంధల మేరకు లీజు పొందామనే విషయం మాజీ ఎమ్మెల్యే బీసీకి తెలియదా అని ప్రశ్నించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, ప్రజలకు మరింత మేలు చేస్తామన్నారు. పట్టణంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రి ప్రారంభం ఈ నెల 14న జరిగిందని, అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రస్తుతం ఆసుపత్రికి రావాల్సిన పరికరాలు రాలేదన్నారు. కోడ్ ముగిసిన తరువాత ఆసుపత్రిలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయలు సమర్పిస్తున్న దేవస్థాన ఈఓ, ఆలయ సిబ్బంది, పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: వచ్చే ఏప్రిల్ 26న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహిస్తుండటంతో ఆలయ అధికారులు, ఉద్యోగులు శుక్రవారం కొబ్బరికాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారం రోజున ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పూజాదికాలు జరిపించి అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ పెద్దిరాజు దంపతులు, స్వామివారి ఆలయ ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశానికి గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): 2024-25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లలో ఉచితంగా ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు ఉన్న గడువును ప్రభుత్వం పొడిగించిందన్నారు. విద్యార్థుల నివాసానికి సమీపంలో ఉన్న ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అందిస్తున్న అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ప్రవేశం పొందవచ్చని వివరించారు. ఆసక్తి గల వారు https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయం/ ఎంఆర్‌సీ సెంటర్/ఎంఈఓ ఆఫీస్, సంబంధిత పాఠశాల నుంచే దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

ఐసీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): ఐసీఐ (ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్)- తిరుపతిలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి సీహెచ్.సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత పాకశాస్త్ర సంస్థ (ఐసీఐ) తిరుపతిలో మాత్రమే ఉందని, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువతీ, యువకులు కలినరీ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నట్లు వెల్లడించారు. తితిదే, ఐఆర్‌సీటీసీ, స్టార్ హోటళ్లు, పర్యాటక, తదితర శాఖ విభాగాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. బీబీఏ, ఎంబీఏ కోర్సులతో పాటు నూతనంగా బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఇంటర్మీడియెట్‌లో 50 శాతం ఉత్తీర్ణతతో ఈ కోర్సులో చేరవచ్చన్నారు. జిల్లా యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9985486271ను సంప్రదించాలని సూచించారు.

తుగ్గలి ఎంపీపీ రాజీనామా


కర్నూలు(అర్బన్): తుగ్గలి మండల పరిషత్ అధ్యక్షురాలు ఆదెమ్మ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమె తన రాజీనామా పత్రాన్ని తనకు అందించారన్నారు. ఖాళీ ఏర్పడిన అధ్యక్ష పదవిని తాత్కాలికంగా భర్తీ చేసేందుకు ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరు ఉపాధ్యక్షుల్లో ఒకరిని అధ్యక్ష పదవికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించే విషయంలో స్పష్టత కోసం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.

లాహిరి లాహిరి లాహిరిలో..



ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న పండితులు

- వైభవంగా ముగిసిన లక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం



కోనేరులో తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

ఆళ్లగడ్డ: జయజయ నారసింహ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. విద్యుద్దీప కాంతులు విరజిమ్ముతుండగా.. వేద పండితులు మంత్రాలు పఠిస్తుండగా.. ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాలు మోగిస్తుండగా.. లాహిరి లాహిరి లాహిరిలో.. ఓహో జగమే ఊయలగా.. అంటూ ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో తెప్పపై విహరించారు. దిగువ అహోబిల క్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవం శుక్రవారం ముగిసింది. ముందుగా భూదేవి, లక్ష్మీసమేతుడైన శ్రీ ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి మాడ వీధుల్లో ఊరేగింపుగా కోనేటి వరకు తోడ్కొని వచ్చారు. అక్కడ ముస్తాబు చేసిన తెప్పపై ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. సుమారు గంటపాటు జరిగిన కార్యక్రమంలో నరసింహ స్వామి కీర్తనలు భక్తి పారవశ్యంతో ఆలపిస్తుండగా, చల్లని వేళ భక్తుల నుంచి హారతులు అందుకుంటూ ప్రహ్లాదవరదస్వామి ఉభయ దేవేరులతో తెప్పపై విహరించారు. కోనేటి చుట్టూ భక్తులు చేరుకుని కార్యక్రమాన్ని వీక్షించి ప్రహ్లాదవరదుడి ఆశీస్సులు అందుకున్నారు.

డీఆర్‌డీఏ సిబ్బంది పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనొద్దు

- డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున డీఆర్‌డీఏ-వైకేపీలో ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్న వారు ఎలాంటి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనరాదని ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గ్రామ సంఘం సహాయకులు మొదలు అన్ని స్థాయిల వారు ఎన్నికల్ కోడ్ అమలులో ఉన్న సమయంలో రాజకీయ పార్టీలకు వత్తాసు పలకడం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం చేయరాదన్నారు. కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెల్దుర్తి మండలంలో కోడ్ ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఇద్దరు గ్రామ సంఘం సహాయకులు(బుక్‌కీపర్లు) కె.సుధాకర్, చిన్న రంగన్నలను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలకు సంబంధించి 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, పింఛన్ల పంపిణీలో ఎలాంటి ప్రచారం ఉండరాదని, ఫొటోలు, వీడియోలు తీయకుండా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. యథాతథంగా వలంటీర్లే పింఛన్లు పంపిణీ చేస్తారని, అయితే వీరి దగ్గర తగిన ధ్రువపత్రాలు ఉండిలేరాలని పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



కర్నూలు మిలిటరీ కాలనీ సమీపంలోని ప్రేమగిరిలో సిలువ యాత్రలో క్రైస్తవులు

గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం క్రైస్తవులు ఏసు మరణ ఇతి వృత్తాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు భూమిపై మనిషిగా పుట్టి మనుషులందరి పాప విముక్తి కోసం సిలువపై మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా క్రైస్తవులు భావిస్తారు. ఈ మేరకు అన్ని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక కన్నీటి ప్రార్థనలు, కీర్తనలు ఆలపిస్తూ క్రీస్తు త్యాగాన్ని మననం చేసుకున్నారు. క్రీస్తు సిలువ మరణం పొందిన ఇతివృత్తాన్ని తెలియజేసేలా ప్రత్యేక వేషధారణలతో విశ్వాసులు ప్రదర్శనలు నిర్వహించారు. ఏసు పలికిన ఏడు మాటలు, దైవసందేశాలను పాస్టర్లు, ఫాదర్లు వివరించారు.

వైభవంగా సుయతీంద్రతీర్థుల పూర్వారాధన





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వేడుకల్లో పాల్గొన్న సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతర్థుల పూర్వారాధన వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలకు అంకురార్పణ పలికారు. వేడుకల్లో భాగంగా సుయతీంద్ర తీర్థుల మూల బృందావనానికి విశేష పూజలు చేపట్టారు. పుష్పార్చన, పంచామృతాభిషేకం అనంతరం హారతులు పట్టా రు. యాగమంటపంలో సుయతీంద్రతీర్థుల చిత్రపటానికి పూల అర్చనతో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆరాధన సందర్భంగా సంస్కృత విద్యాపీఠం విద్యార్థుల మంత్రోచ్చారణలు చేయగా, రూపశ్రీ ప్రభంజన దాస వాణి కార్యక్రమం నిర్వహించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీ నేర విభాగం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులలో తనిఖీలు విస్తృతం చేయాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నేర విభాగం ఏపీ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సెబ్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ వినోద్‌కుమార్‌తో కలసి శుక్రవారం పంచలింగాల, సుంకేసుల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. అనంతరం కర్నూలు సెబ్ స్టేషన్ చేరుకుని రికార్డులను పరిశీలించారు. సెబ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం సరఫరా మార్గాల్లో రూట్‌వాచ్ చేపట్టాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోరంట్ల మాధవుడి రథోత్సవం



శ్రీలక్ష్మి మాధవుడి మూలవిరాట్

కోడుమూరు రూరల్: శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోరంట్ల గ్రామంలో శనివారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు దేవదాయ శాఖాధికారులు, గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాక, ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాదిమంది ప్రజలు తరలి రానున్నారు.

30 నుంచి పీఓలు, ఏపీఓలకు శిక్షణ

కర్నూలు(కల్చరల్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 30, ఏప్రిల్ 1 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ శుక్రవారం మధ్యాహ్నం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడతూ సుంకేసుల రోడ్డులోని ఎమ్మార్పీ కన్వెన్షన్ హాల్‌లో నాలుగు సెషన్లలో 8 నియోజకవర్గాలకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మొత్తం పీఓలు, ఏపీఓలు 5,357 మందిని నియమించగా.. ఇందులో 176 మంది రిటైర్మెంట్ తదితర కారణాల వల్ల ఆర్డర్స్ సర్వ్ చేయలేదన్నారు. మిగిలిన వారందరికీ శిక్షణనిస్తామని, హాజరు కాకపోతే చర్యలు తప్పవన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్ రావు, ఆదోని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, కోడుమూరు రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, పత్తికొండ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోసిగి @ 43.4



కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సూర్య ప్రతాపం ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎక్కువగా ఉంటోంది. శుక్రవారం కోసిగిలో 43.4, బండిఆత్మకూరులో 43.0, బనగానపల్లిలో 42.93, మిడుతూరులో 42.86, కోడుమూరులో 42.79, అవుకులో 42.79, నందికొట్కూరులో 42.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలులో పగటి ఉష్ణోగ్రత 42.3. రాత్రి ఉష్ణోగ్రత 27.7 డిగ్రీలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటికి వెళ్లాలంటే జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సులేమాన్ మృతి





సులేమాన్ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ పోచా, అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ పోచా నివాళులు



సులేమాన్ (ఫైల్)

వెలుగోడు: జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సులేమాన్ ప్రస్తుతం జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్‌గా, ఉస్మానియా ముస్లిం అంజుమన్ కమిటీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా, చీఫ్ ఆడిటర్‌గా, సిరాజుల్ ఉలూమ్ మదరస ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో ఎమ్మెల్యే శిల్పా పాల్గొని భుజం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సయ్యద్ సులేమాన్ అకాల మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. తాను వెలుగోడు వచ్చిన వెంటనే తనతో నడిచిన నాయకుడన్నారు. పార్టీ బలమైన నాయకుడిని కోల్పోవడం బాధగా ఉందన్నారు. ఆయన సేవలను మెచ్చి జిల్లా కో-ఆప్షన్‌సభ్యుడిగా ఎన్నుకున్నామన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియల్లో డాక్టర్ శివ శంకర్‌రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, ఎంపీపీ లాలం రమేష్, అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ మెంబర్లు, సింగిల్ విండో ప్రెసిడెంట్ వంగాల నాగేశ్వర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ సింగల్ విండో చైర్మన్ బళ్లారి సత్యనారాయణ, మాజీ సింగల్ విండో చైర్మన్ వెంకటరామిరెడ్డి, బండి ఆత్మకూరు ,ఆత్మకూరు మండల ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెరిగింది

నంద్యాల(సెంట్రల్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం పెరగనుంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి కొత్త వేతనం అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రోజుకు రూ.272గా అందుతున్న కూలి రూ.300కు పెరుగుతుంది. ఈ నిర్ణయంతో నంద్యాల జిల్లా పరిధిలో 1.60 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అయితే కూలీలకు మూడేళ్లుగా వేసవి భత్యం ఇవ్వకపోగా...ఈసారి కూలీ పెంపుతో సరిపెట్టారు. జిల్లా వ్యాప్తంగా 2.90 లక్షల జాబ్ కార్డ్స్ ఉండగా, వీటిలో 2 లక్షల దాకా యాక్టివ్‌గా ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకొచ్చిన కేంద్రం ఏటా మాదిరిగానే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గత ఆర్థిక సంవత్సరం రూ.15 మాత్రమే పెంచగా, ఈ సారి రూ.13 మేర అధికంగా అంటే రూ.28 పెంచింది. కూలీలకు తాగునీటి సరఫరా కోసం పంచాయతీలకు నిధులను విడు దల చేస్తోంది. ఒక్కో కూలీకి రూ.2.50 చొప్పున కేంద్రం చెల్లించే నిధులతో పని ప్రదేశాల్లో తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుంది.

నడిపిస్తున్న భక్తి



కాళ్లకు కట్టెలు కట్టుకుని శ్రీశైలం వెళ్తున్న కర్ణాటక భక్తుడు

ఆలూరు రూరల్: ఉగాది ఉత్సవాలకు కన్నడిగులు తరలివెళ్తున్నారు. ఆనవాయితీ ప్రకారం ఇంటి ఆడపడుచు శ్రీశైల భ్రామరాంబికకు సారె సమర్పించేందుకు పాదయాత్రగా బయలుదేరారు. ఇందులో కొందరు పొడవాటి కర్రలను కాళ్లకు కట్టుకుని వాటిని బ్యాలెన్స్ చేస్తూ వందలాది కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు. వీరి కోసం ఆలూరు-కర్నూలు రహదారి పొడవునా అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేశారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్, ఎస్పీ



హైకోర్టు జడ్జితో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

నంద్యాల(వ్యవసాయం): హైకోర్టు జడ్జి ఏవీ రవీంద్రబాబును ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలులో జరిగే వర్క్‌షాప్ నిమిత్తం విజయవాడ నుంచి వెళ్తున్న జడ్జి మార్గమధ్యలో నంద్యాల గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్, ఎస్పీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. వీరితో పాటు నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, బార్ అసోసియేషన్ బార్ అసోసియేషన్ నాయకులు ప్రతాపరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రఘుప్రకాష్, భూపని వెంకటేశ్వర్లు, తదితరులు జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డీసీసీబీ కొత్త బ్రాంచీల్లో నేటి నుంచి లావాదేవీలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్యాపిలి మండలం నేరెడుచెర్ల, డోన్ మండలం ఎద్దుపెంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన శాఖల్లో శనివారం నుంచి బ్యాంకింగ్ వ్యవహారాలు కొనసాగనున్నాయి. నేరెడుచెర్ల బ్రాంచ్ మేనేజర్, ఒక స్టాఫ్ అసిస్టెంటు, ఎద్దుపెంటలో అసిస్టెంటు మేనేజర్, స్టాఫ్ అసిస్టెంటు విధులు నిర్వహిస్తారు. ఈ రెండు శాఖలను ఈ నెల మొదటి వారంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ప్రారంభించారు. ఇటీవలనే నూతన శాఖల్లో లావాదేవీలు నిర్వహించేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా లైసెన్స్‌లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐ లైసెన్స్‌లు జారీ కావడంతో లావాదేవీలు నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.